




RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ గురువారం 11-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 179 పేజీలు : 4 వెల : రూ 2-00


## 2లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

### కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈటెల ప్రశ్న

హైదరాబాద్,జూలై 10: రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే వాటి ఊసే ఎత్తడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ఏమ్యిందని, మెగా డిఎస్సీ ఎక్కడ పోయిందని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దనెక్కిందని అన్నారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ ఆధ్వర్యంలో ఉప్పల్ అసెంబ్లీ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్కారుపై అవిశ్వాసం ప్రకటించిన నిరుద్యోగ యువత యుద్ధం చేస్తున్నారని విమర్శించారు.

## పాత్రికేయులకు ఇచ్చిన మాట తప్పం-మంత్రి పొన్నం ప్రభాకర్





హైదరాబాద్: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన మాటను తప్పేది లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యు జె) ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలతో కలిసి మంత్రి పొన్నం పాల్గొన్నారు. హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అయిన కాంగ్రెస్... ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రభుత్వానికి , ప్రజలకు మధ్య వారధిగా మీడియా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించడంలో మీడియాది ప్రముఖ పాత్ర ఉంటుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో హెచ్.యూ.జేతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్స్, హెల్త్ కార్డ్స్ , ఇండ్ల స్థలాల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ , ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్ , ఐజేయు కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ,తెలంగాణ చిన్న, మధ్యతరహా పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు , ప్రధాన కార్యదర్శి అశోక్ , హెచ్.యూ.జే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్ , ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి , వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.నరేందర్ రెడ్డికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుదాదాపు 35యేండ్లుగా అటు మీడియా రంగంలో, ఇటు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సీనియర్ పాత్రికేయులు, ముద్ర దినపత్రిక సంపాదకులు, ఐజేయు జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డిని ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేసి, సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డును మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానం చేశారు. అలాగే ఇటీవల తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్ రెడ్డి , టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన కె.విరాహత్ అలీలతో పాటు, టీయుడబ్ల్యూజే కార్యదర్శి వి.యాదగిరి , కోశాధికారి వెంకట్ రెడ్డి , కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి , హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్ కుమార్ , టియుడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్ , అనిల్ , గౌస్ మోహినుద్దీన్ తదితరులను మంత్రి పొన్నం సన్మానించి , శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యవసాయ రంగాన్ని కాపాడుకునే ప్రయత్నం

- అర్హులైన వారికే రైతుభరోసా పెట్టుబడి
- సన్న,చిన్నకారు రైతులకే చేయూత
- హామీ అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల






ఖమ్మం,జూలై10: వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయడం కోసం తమ ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. రైతుభరోసా పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించింది. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని మంత్రి తుమ్మల అన్నారు.ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.

## తెలంగాణ డిజిపిగా జితేందర్ నియామకం

హైదరాబాద్: తెలంగాణ డిజిపిగా సీనియర్ ఐపిఎస్ అధికారి జితేందర్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన డిజిపి హోదాలోనే హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా వనిచేస్తున్నారు. అదేవిధంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవి గుప్తాను బదిలీ చేశారు. జితేందర్ 1992 ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవారు. డిజిపి జితేందర్ స్వస్థలం



పంజాబ్ లోని జలంధర్ ప్రాంతం. గతంలో నిర్మల్, బెల్లంపల్లి ఎఎస్ పిగా సేవలందించారు. మహబూబ్ నగర్, గుంటూరు ఎస్పిగా జితేందర్ పని చేశారు. ఆయన సిబిఐలో పని చేయడంతో పాటు గేహౌండ్స్ బాధ్యతలు కూడా నిర్వహించారు.తెలంగాణ డిజిపిగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సీనియర్ ఐపిఎస్ అధికారి జితేందర్ కలిశారు. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ వరకు ఆయన పదవీలో ఉండనున్నారు.



వరంగల్ కలెక్టరును మర్యాద పూర్వకంగా కలిసిన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి

## కాంగ్రెస్ మార్క్..మార్పు వచ్చింది

### బల్లిపడిన టిఫిన్లు..చిట్టెలుక పడ్డ చట్నీలు
### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా

హైదరాబాద్,జూలై10 : మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో..



కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

## మోదీ హయాంలో పెచ్చుమీరిన నిరుద్యోగం : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ: కాషాయ పాలకులే లక్ష్యంగా ఎస్పీ చీఫ్, ఆ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. యూపీలో స్మార్ట్ సిటీని రూపొందిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందనీ, కానీ వారి స్మార్ట్ సిటీలో ఎక్కడచూసినా జలమయమైన రోడ్లు, చెత్తచెదారం పేరుకుపోయిన వీధులు కనిపిస్తాయని ఎద్దేవా చేశారు. కాషాయ పాలకుల హయాంలో ఎటుచూసినా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజల వాహనాలు లోయల్లో




పడిపోతున్నాయని అన్నారు.ఆరోగ్య సేవలు, ఆస్పత్రులు ప్రాథమిక సౌకర్యాలు లేక పడకేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలేష్ యాదవ్ బుధవారం ఇటావాలో విలేకరులతో మాట్లాడారు. యూపీలోని హత్రాస్‌లో జరిగిన ఘటన కూడా అధికారుల వైఫల్యం కారణంగానే జరిగిందని ఆరోపించారు. నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని, యువత ఉద్యోగాల కోసం వీధుల చుట్టూ తిరుగుతున్నారని అఖిలేష్ ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు యూపీలో వరదల ప్రభావంతో పలు జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ఫిలిబిత్, లఖింపూర్ ఖేరి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ బుధవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరదలతో 133 గ్రామాల్లో నష్టం వాటిల్లిందని, వేలాది ఎకరాల పంట దెబ్బతిన్నదని వివరించారు.

## రాష్ట్రంలో సంక్షేమం లేదు

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ , జూలై 10, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం నాడు అంబర్ పేట నియోజకవర్గంలో పర్యటించారు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అంబర్ పేట్ లో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో కూడా చాలా సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్స్ వేసేందుకు జీహెచ్ఎంసీ డబ్బు లేదని చెప్పడం విడ్డూరమని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ కూడా ఇవ్వలేదని చెప్పారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన రేషన్ కార్డులు తప్ప.. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు రాష్ట్రంలో ఎవ్వరికీ అందలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న ఐదు కేజీల ఉచిత బియ్యం అందడం లేదని పేర్కొన్నారు. అలాగే పొదుపు సంఘాల్లో చేరలేక పోతున్నారని, కొత్త గ్యాస్ కనెక్షన్ తీసుకోలేక పోతున్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా ధ్వంసమైన రోడ్లను రిపేర్ చేయడం లేదని మండిపడ్డారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఫామ్ హౌస్ వెళ్లాడని, కొత్త ప్రభుత్వం దానిపై ఉలుకు పలుకు లేదని దుయ్యబట్టారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, కాలేజీకి వెళ్లి మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తానన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

## ఆ వార్తలు రాసేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలి: హైకోర్టు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ పై సిజె ధర్మాసనం విచారణ చేపట్టింది. జడ్జిలు, వాళ్ల కుటుంబ సభ్యుల పేర్లు మీడియాలో ప్రసారం చేయొద్దని ధర్మాసనం పేర్కొంది. కొన్ని పత్రికలు జడ్జి పేరు, మొబైల్ నంబర్ ప్రచురించినట్లు హైకోర్టు తెలిపింది. ఫోన్ ట్యాపింగ్ పై మీడియా సంయమనం, బాధ్యతో వ్యవహరించాలని, ఫోన్ ట్యాపింగ్ కేసు వార్తలు రాసేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేశారని. అందుకే ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలనుకోవడం లేదని వివరించింది. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిందని, విచారణ జరుగుతోందని, నిందితులను అరెస్టు చేశామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. పలువురు పోలీసు అధికారులు ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు ప్రభుత్వం కౌంటర్ ఇచ్చింది.



# సంపాదకీయం

గురువారం 11-07-2024

## డేంజర్ సిగ్నల్స్....

ఈ రోజు గట్టెక్కితే చాలు అనేదే ప్రలోభం అంటే. అందువల్ల అనేక ప్రలోభాలకు ప్రజలను గురి చేస్తుంటారు నాయకులు. ప్రజలు నిశితంగా గమనించాల్సింది హామీలు అమలు చేయదగినవా అనేది. ఇది చాలా ముఖ్యం. అమలు చేయదగిన హామీలను నమ్మవచ్చు. అలాంటి హామీలను నమ్మటానికి తాయిలాలు అవసరం లేదు. ప్రతి మనిషికీ విచక్షణ ఉంటుంది. ప్రతి మనిషికీ అర్థం అవుతుంది ఎవరు ఏం చెప్తున్నారు, వారి ఉద్దేశాలు ఏమిటి అనేది. గతంలో ఏం చెప్పారు, ఎంతమేరకు చేశారనేది ప్రతి మనిషీ బేరీజు వేసుకోగలడు. అయితే ప్రలోభాల ముందు మనిషి విచక్షణా జ్ఞానం బలహీనపడే ప్రమాదం ఉన్నది.కర్ణాటకలో వరసగా ప్రభుత్వం పన్నులు పెంచుతూ పోతుంది. ఇది తెలుగు రాష్ట్రాలకు డేంజర్ సిగ్నల్స్ పంపుతుంది. కర్ణాటకలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలు అయిన తర్వాత తమ ఖజానాను నింపుకునేందుకు అనేక రకాలుగా పన్నులు పెంచుతూ వస్తుంది. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఆ మాత్రం పన్నులు పెంచకపోతే రాబడి ఎక్కడి నుంచి వస్తుందని కర్ణాటక పాలకులు ప్రశ్నిస్తున్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నా, ఇచ్చిన హామీలను ప్రజలకు అందించాలన్నా ఖచ్చితంగా ప్రజలపై భారం మోపాల్సిందేనన్నది కన్నడ పాలకుల వాదన. ఇందుకు సహకరించాలని కూడా ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కోరుతుంది. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇచ్చి అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు వీటిని అమలు చేయాలంటే ఎడా పెడా పన్నులను పెంచుతూ పోతుంది. తాజాగా పెట్రోలు, డీజిల్ పై అమ్మకపు పన్ను ను పెంచింది. పెట్రోలు ధరపై మూడు రూపాయలు, డీజిల్ ధరపై లీటరకు 3.02 రూపాయలు పెంచుతూ కర్ణాటక సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పెంచిన ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపింది. దీనివల్ల ఖజానాకు 2,800 కోట్ల రాబడి సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉచిత విద్యుత్తును అమలు చేయడానిక విద్యుత్తు ఛార్జీలను పెంచింది. మద్యం ధరలను కూడా విపరీతంగా పెంచింది. దేశీయ లిక్కర్ పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ 20 శాతాన్ని పెంచారు. ఇక ఆదాయం వచ్చే అన్ని మార్గాలను వెతుక్కుంటూ కన్నడ సర్కార్ ధరలను పెంచుతూ వెళుతుంది. ఇప్పుడు తెలంగాణలోనూ ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే ఖచ్చితంగా ఏదో ఒక రూపంలో ప్రజలపై భారం మోపక తప్పని పరిస్థితి అంటున్నారు ఆర్థిక నిపుణులు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చింది. వీటిని అమలు చేయాలంటే వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. ఇక మద్యం ధరలను పెంచుతారన్న ప్రచారం జరుగుతుంది. అలాగే ఆదాయం పెరిగే మార్గాలపై ఆర్థిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ఇటీవల వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అందులో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ వంటి శాఖల అధికారులు ఉన్నారు. దీంతో ఇక్కడ కూడా ఆ శాఖలకు సంబంధించిన క్రయ విక్రయాల్లో పన్నులు పెంచే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే స్థానిక సంస్థలు ఉండటంతో ఇప్పుడు చేస్తారా? తర్వాత చేస్తారా? అన్నది తెలియదు కానీ.. పన్నులు పెంచడమయితే గ్యారంటీ అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇందుకు అతీతం కాకపోవచ్చు. ఎందుకంటే అక్కడ తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ తో సక్సెస్ సాధించింది. ప్రజలు కూటమికి పట్టం కట్టారు. అయితే ఏపీలో ప్రభుత్వం ఏర్పడి పది రోజులు కూడా కాలేదు. కానీ రానున్న రోజుల్లో కొన్ని ధరలు పెరిగే అవకాశాలను కొట్టిపారేయలేమంటున్నారు ఉన్నతాధికారులు. ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఖచ్చితంగా ప్రజలపై భారం మోపాల్సిందే. అంతే తప్ప ఇప్పటికిప్పుడు సంపద సృష్టి సాధ్యం కాదు. అయితే కర్ణాటక, తెలంగాణ కంటే ఏపీకి ఒక విషయంలో అనుకూలత ఉంది. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అక్కడ కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవచ్చు. ఇకపోతే ఉచితాలు ఇస్తామని చెప్తారు మన నాయకులు. ఉచితాలు ఎంతకాలంఇవ్వగలదు ఏ ప్రభుత్వమైనా? ప్రజలు ఎప్పుడూ ఉచితంగా వసతులు కల్పించమని అడగరు.కొన్ని సేవలు ఉచితంగా కల్పించటమనేది సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాజ్యాంగంగా ప్రభుత్వాలు వాటంతట అవే ఏర్పాటు చేస్తుంటాయి.ఉదాహరణకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలని కోరుకునేవారుంటారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన ఉచితంగా అందించాలని కూడా కోరుకుంటారు కొన్నివర్గాల వారు. మన దేశంలో ఉన్న విచిత్రం ఏమంటే ప్రాథమిక విద్యకు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తాం; అదే ఉన్నత విద్యకు ప్రభుత్వ వ్యవస్థల వైపు చూస్తాం. ఉదాహరణకు గవర్నమెంటు కాలేజీలో డాక్టరు కోర్స్, ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం పొందటం ప్రతిష్టాత్మకం. అదే ఎల్కేజీ దగ్గరి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రైవేటు బడుల్లో చదవటం కోరుకుంటాం. ప్రభుత్వ బడుల్లో పరిస్థితిని మెరుగుపరిచే కార్యక్రమాన్ని మధ్యతరగతుల వారు పెద్దగా అభినందించరు. ఎందుకంటే వాళ్ల పిల్లలు ఆ బడులకు పోరు గనుక. ఈ దమన నీతి నుంచి మనిషి బయటపడాలి. మెరుగైన వైద్యం, మెరుగైన విద్య మౌలిక వసతుల కల్పనలో భాగంగా, అభివృద్ధి కార్యక్రమంగానే చూడాలి. ఎక్కువ మంది ప్రజలు మెరుగైన రవాణా సౌకర్యం కావాలనుకుంటారు కానీ, ఇట్లాంటి హామీలను ప్రజలే తిరస్కరించాలి. ఇక్కడే ఓటరు విజ్ఞత తెలిసేది.ఇప్పుడు గనక మనం నోరు తెరవకపోతే వచ్చే ఐదేండ్లు ఐదు వేళ్లతో నోరు మూసుకోవాల్సిందే. ఇక్కడ ఏది కోరుకోవాలి? నోరెత్తి అడిగే స్వేచ్ఛా లేక నోరు మూసుకొని మౌనంగా ఉండే దౌర్భల్యమా? మనం స్వేచ్ఛను పరిరక్షించుకోవాలంటే మన ఓటును అమ్ముకోకూడదు.

## విద్యార్థులకు వర్షాకాలం సీజనల్ వ్యాధులపై ఆరోగ్య పరీక్షలు





బాల్కొండ జూలై 10(లోకం తీరు ) బాల్కొండ మండల కేంద్రంలో మహాత్మాబాపూలే హాస్టల్ మరియు పాఠశాల విద్యార్థులకు మరియు మహతి కిసాన్ నగర్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ ,వచ్చేది వర్షాకాలం కాబట్టి వర్షాకాలంలో సీజన్ వ్యాధులపై పిల్లలకు అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని చేతులను శుభ్రంగా, కడుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు..జ్వరం సర్ది కడుపునొప్పి అలాంటివి వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వాయిజర్ చిలుక వాని, మధుమతి ఆరోగ్య సిబ్బంది రాజు ఆశ వర్కర్లు గంగామణి విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి జులై 10 (లోకం తీరు ) బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మోర్తాడ్ తహసిల్దార్ జి.సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా మండల అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరంలో కేంద్ర బడ్జెట్లో ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలని, ఐసిడిఎస్ రక్షణ, అంగన్వాడీ కార్యకర్తల, ఆయాల కు చట్టబద్ధత కల్పించాలని, రాష్ట్రంలో తమ సమస్యల పరిష్కారం కోసం 24 రోజులపాటు నిరసన సమ్మె కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో కథ ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తామని గత ప్రభుత్వం ఆమె ఇచ్చిందన్నారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా జూలై 24న , అంగన్వాడి కార్యకర్తలు దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే నిరసన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఇచ్చిన హామీల మేరకు ప్రస్తుత ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేసి అందించాలన్నారు. వచ్చే బడ్జెట్లో ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలన్నారు, ఐసిడిఎస్ బలోపేతం, నాణ్యమైన ఆహారంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ, ప్రీ స్కూల్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాలను నోడల్ ఏజెన్సీలుగా నియమించి ఈసీసీ ఈ ని అమలు చేయాలని వారు కోరారు. అంగన్వాడి కార్యకర్తలను మూడవ తరగతి, ఆయాలను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగ క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న రెగ్యులేషన్, 45వ, ఐఎల్ సి సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీసం 26 వేల వేతనం, పదివేల పింఛన్ , పిఎఫ్ , ఈఎస్ఐ పలు సౌకర్యాలు వెంటనే అందించాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలకు, పే, కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేసి అందించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్ గుర్తించాలని వారు పేర్కొన్నారు. ఏ విధంగానైనా ఐసిడిఎస్ ను ప్రైవేటీకరణ కరణ చేయవద్దని, ప్రైవేటీకరణ వెంటనే నిలిపివేయాలని మండల అంగన్వాడీ కార్యకర్తలు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలనుడిమాండ్ చేశారు. గత 24 రోజులుగా దేశవ్యాప్తంగా చేసిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని మండల అంగన్వాడీ కార్యకర్తలు ,ఆయాలు, కోరారు.

## బీర్షాబా కంపెనీ పై కేసు నమోదు

### కంపెనీ ప్రతినిధుల ఇళ్లకు సీజ్..?

### పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి





కామారెడ్డి జిల్లా, జూలై 10 ( లోకంతీరు ) :బీర్షేబా కంపెనీ పై కేసులు నమోదు చేసి, ఆ కేసులలో నేరస్తుడు షైక్ ఇస్మాయిల్, అతని భార్య సమీన, వారి కుటుంబ సభ్యులు, మొదలగు వారి పేరు మీద ఉన్న ఆస్తులను సీజ్ చేయడం జరిగింది.ఇంకా ఆ కేసువిచారణలోనడుస్తుంది.అయితే గత 9 వ తారీకు మంగళవారం తెల్లవారు జామున కామారెడ్డి పట్టణమునకు చెందిన లాలమ్మల అంజన్ కుమార్ అనే వ్యక్తి, 2020 లో కామారెడ్డి పట్టణ పోలీస్ వారు సీజ్ చేసిన బీర్షెబ కంపని యొక్క ఆఫీస్, వివేకానంద కాలనిలో గల దాని యొక్క తాళం తీసి, అందులో ఉన్న టేబుల్ లను, కుర్చీలను, ఇతర వస్తువులను ఒక డీసీఎం వ్యాన్ లో ఎక్కించుకుని తీసుకెళ్తుండగా, అది గమనించిన స్థానికులు పోలీస్ వారికి తెలియజేయగా, అట్టి డీసీఎం తో సహా పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి విచారణ చేయగా, లాలమ్మల అంజన్ కుమార్ అనే వ్యక్తి 2023వ సంవత్సరంలో షేఖ్ ఇస్మాయిల్ భార్య సమీనా పేరు మీద ఉన్న ఒక ఓపెన్ ప్లాట్ నీ కొనుగోలు చేసినాడు.అయితే ఆ ప్లాట్ అనేది పోలీస్ కామారెడ్డి వారిచేత 2020 వ సంవత్సరంలోనే సీజ్ చేయబడింది. ఆ విషయం తెలిసి కూడా లాలమ్మల అంజన్ కుమార్ షేఖ్ ఇస్మాయిల్ వద్ద నుండి ఆ ప్లాట్ తో సహా ఉన్న ఇంటిని కొనుగోలు చేసినాడు.సీజ్ చేసిన ఇంటిని కొనుగోలు చేయడమే కాకుండా, అందులో సీజ్ చేసిన వస్తువులను తాళం తీసి దొంగతనంగా తీసుకెళ్తున్న అంజన్ కుమార్ పై కేసు చేయడం జరిగింది.తిరిగి ఆ ఇంటిని మరోసారి సీజ్ చేయడం జరిగింది.అని పోలీసు వారు అన్నారు.ప్రజలందరికీ ముఖ్యమైన విన్నపం ఏమనగా, బీర్షబ కేసు లో సీజ్ చేయబడిన స్థిర, చర ఆస్తులను ఎవరు కూడా కొనుగోలు చేయకూడదని, షేఖ్ ఇస్మాయిల్ అతని కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేసినట్లయితే, కొనుగోలు చేసిన వారి మీద, అమ్మిన వారి మీద చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోబడుతాయి అని, అంతేగాక ఇప్పటికే ఎవరైనా అలా తెలియకుండా వారి యొక్క ఆస్తులను కొనుగోలు చేసినట్లయితే వెంటనే మాకు తెలియచేయాలని, లేనిచో ఆ తర్వాత ఇన్వెస్టిగేషన్ లో మాకు తెలిసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

## పెండింగ్ సమస్యలపై పట్టువిడుపులు అవసరం

నల్లగొండ,జూలై10: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాలు సీఎంలు భేటీ అవ్వడం శుభ పరిణామం అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. విభజన సమస్యలపై పంతాలకు పోకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసుకోవాలి అని సూచించారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా చేశారు.రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరం అవుతాయి అనే నమ్మకం కలిగిందన్నారు. రెండు రాష్ట్రాల సీఎంలు కలవడాన్ని అభివృద్ధి కోణంలో చూడాలి. అందులో రాజకీయకోణం చూడవద్దన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసే బెదిరింపులకు అసలు భయపడవద్దు.. అప్పుడే అభివృద్ధి పనులు చేసుకోగలుగుతం అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకోవడం తప్ప మినహా మరో మార్గం లేదు. కృష్ణా జలాల విషయంలో న్యాయబద్ధంగా తెలంగాణకు వాటా ఇవ్వడానికి ఏపీ ప్రభుత్వం సహకరించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పెండింగ్ పనులు పూర్తి చేస్తే జిల్లాలో సాగునీటి సమస్యలు తీరుతాయని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. శాసన మండలి రద్దు అనేది అసంబద్ధమైనది. అలాంటి పరిస్థితి ఏం లేదు. 2026లో పునర్విభజన చట్టం

### స్నేహపూర్వకంగా పరిష్కారం కోసం కృషి

### తెలంగాణలో ఎత్తిపోతలే శరణ్యం: గుత్తా

అమలయ్యే అవకాశం ఉంది. ఈ చట్టం అమలైతే తెలంగాణలో 34, ఏపీలో 50 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి బాగాలేదని రూ. 7 లక్షల కోట్ల అప్పు ఉందని రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది. అనవసర ఖర్చులు తగ్గించుకోవడం మంచిది. రైతుబంధు, రైతు భరోసా కేవలం పది ఎకరాల వరకు ఇస్తే చాలు. సేద్యం చేసే భూములకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలి. రైతు భరోసా, రైతు రుణమాఫీ అర్హులైన వారికే ఇవ్వాలి. శాసన మండలి చైర్మన్ హోదాలో ఉండి రాజకీయాల గురించి మాట్లాడను. పార్టీ ఫిరాయింపుల విషయంలో గతంలో ఉన్న శాసన మండలి చైర్మన్, స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో మేము కూడా అలాగే తీసుకుంటాం. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు చాలా కష్టపడుతున్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి అవుతాయని అనుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం మంచిదే అని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

### ఇలాంటి అరెస్టులకు మేము ఎప్పుడు భయపడేది లేదు

### భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి



ఆర్మూర్, జూలై10(లోకంతీరు) : భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగానికి ఇచ్చినటువంటి రుణమాఫీ గాని రైతుబంధు రైతు కూలీలకు రు.12వేలరూపాయలు,కౌలు రైతులకు రూ.15000 ఇవ్వాలని సత్యాగ్రహ దీక్ష దీక్షకు వెళ్లకుండా ముందస్తుగా భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి మరియు కిసాన్ మోర్చా నాయకుల్ని మరియు రైతుల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించడం జరిగింది. పోలీస్ స్టేషన్ తరలించిన వారిలో రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి తేలుఒడ్డెన్న.చిట్టిబాజన్ శేష గారి పోశెట్టి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు మాట్లాడుతూ ఇట్లాంటి అక్రమ అరెస్టులు ఎన్నిటికైనా భయపడమని కాంగ్రెస్ ప్రభుత్వము రైతాంగానికి ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చే అంతవరకు రైతుల వెన్నంటే ఉండి రైతాంగానికి ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చే వరకు ఉద్యమాలు చేపడతామని కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు

## గ్రూప్-2, గ్రూప్-3 ఉచిత కోచింగ్ ప్రారంభం

నిజామాబాద్, జూలై 10 (లోకంతీరు): నిజామాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అహ్మదీ బజార్‌లో గల ఉర్దూ ఘర్ లో గ్రూప్ -2,గ్రూప్ -3అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభం అయ్యాయని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తెలిపారు. గ్రూప్-2 లో 783 పోస్టులు, గ్రూప్-3 లో పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుందని, వీటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిపుణులైన అధ్యాపకుల ద్వారా గ్రూప్స్ పరీక్షల శిక్షణ అందించబడుతోందని తెలిపారు. శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు (45) రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లు: 99489-56994,97003-51786లకు సంప్రదించాలని సూచించారు.

## పరిశుద్ధ పరిశుభ్రత అభివృద్ధి పనులను పరిశీలించిన డిఎల్పిఓ



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి జులై 10 ( లోకం తీరు ) బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలం బట్టాపూర్, తడపాకల్ గ్రామాలను ఆకస్మికంగా డి .ఎల్. పి. ఓ. అధికారి శివ కృష్ణ,విచ్చేసి ఆయా గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.ఆయా గ్రామాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను, వన మహోత్సవ పనులను, శానిటేషన్ పారిశుద్ధత, పరిశుభ్రత పనులను డిఎల్పిఓ శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో డి ఎల్ పి ఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డి. ఎల్ .పి. ఓ శివ కృష్ణ సంబంధిత వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నాణ్యతతో కూడిన పనులు జరిగేలా చూడాలని తెలిపారు. అంతేకాకుండా వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన గురి కాకుండా ఉండేందుకై ప్రతి వీధి వీధికి పరిశుభ్రత, పారిశుద్ధ్యంపనులు గ్రామపంచాయతీ సిబ్బందిచే వెంట వెంటనే చేపట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో, ఈ కాలనీలో, ప్రతి వీధివీధిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని అన్ని డ్రైనేజీలు ప్రతిరోజు శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అధికారులు పనుల పట్ల నీళ్ల సంభవిస్తే శాఖ పరమైన చర్యలు చేపడతామని ఆర్మూర్ డిఎల్పిఓ శివకృష్ణ హెచ్చరించారు. ఆయన వెంట ఈ కార్యక్రమంలో ఏరుగట్ల మండల ఎం.పీ.డీ.వో. వెంకటేశ్వర్లు, ఎం.పీ .ఓ. శివ చరణ్, ఏ.పీఓ. వెంకటేష్. ఆయా గ్రామాల కార్యదర్శులు, కారోబర్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై, బెల్టులు పంపిణి

బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి జూలై 10 ( లోకం తీరు ) బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని ఎస్సీ బీసీ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు టై, బెల్టులను, తన సొంతఖర్చులతోమండలపిఆర్టియుఅధ్యక్షులు మగ్గిడి ప్రవీణ్ అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల పిఆర్టియు అధ్యక్షులు మగ్గిడి ప్రవీణ్ కోరారు. తన వంతు సహకారాలు అవసరమైతే మరింత అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విట్టల్, పాఠశాల కమిటీ చైర్మన్ వరలక్ష్మి, రమేష్ గౌడ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం కూలాలి..తాము గద్దెనెక్కాలి

## బిజెపి తీరు ఇలాగే ఉందన్న రాఘువులు

## లౌకికశక్తులను రేవంత్ ఏకం చేయాలని పిలుపు

హైదరాబాద్,జూలై10: తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా.. ఎప్పుడు గద్దెనెక్కుదామని భాజపా కాచుక్కూర్చుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ కుట్రలను తిప్పికొట్టేందుకు లౌకికశక్తులను సీఎం రేవంత్‌రెడ్డి ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని మరిచిపోయి..రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కిషన్‌రెడ్డి చదువుతున్నారని రాఘువులు మండిపడ్డారు. కేవలం రాష్ట్రప్రభుత్వాన్ని తిట్టిపోయడం మాని, కేంద్రం ఏం చేసిందో...ఏం చేస్తుందో చెప్పాలన్నారు. దేశమంతా అభివృద్ధి జరిగితే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు సీట్లు ఎందుకు తగ్గాయో ప్రధాని మోదీ చెప్పాలని రాఘువులు ప్రశ్నించారు. రష్యా పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మరోవైపు పార్లమెంట్‌లో ఇష్యూ టు ఇష్యూను బట్టి వ్యవహరిస్తామని కేటీఆర్ చెబుతున్నారని రాఘువులు గుర్తుచేశారు. అలా స్పందించడం రాజకీయం కాదు.. లొంగుబాటు అని వ్యాఖ్యానించారు. భారాసకు మనుగడ ఉండాలంటే భాజపాకు వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సీట్లు ఎందుకు తగ్గాయనే ఆలోచన, ఆత్మవిమర్శ చేసుకోకుండా మోదీ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎన్నికలను భాజపా డబ్బుతో ముంచేసింది. తెలంగాణలో ఆ పార్టీ ఓటు బ్యాంకు 19 నుంచి 35 శాతానికి పెరగడం ప్రమాదకరం. రాష్ట్రంలో భాజపాను నియంత్రించడంలో కాంగ్రెస్ విఫలమైంది. కేరళలో కాషాయ పార్టీ ఒక్క సీటు సాధించడం చింతించాల్సిన విషయం. అక్కడ కమ్యూనిస్టులను కాంగ్రెస్ ప్రతిపక్షంగా చూసినందునే భాజపా గెలిచింది. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోదీ వ్యవహరిస్తున్నారు. ఇండియా కూటమి విచ్ఛిన్నం కాకుండా ముందుకు వెళ్లడంలో సీపీఎం చేసిన త్యాగం మరెవరూ చేయలేదు. పశ్చిమబెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ సీట్లు సర్దుబాటు చేసుకున్నా కాంగ్రెస్‌కు చెందిన ఏ ఒక్క జాతీయ నాయకుడూ ప్రచారం నిర్వహించలేదు. ఓట్లు, సీట్లు కాదు.. దేశాన్ని రక్షించుకోవడమే సీపీఎం లక్ష్యం. మతోన్మాదాన్ని తెలంగాణ ప్రజల మనసు నుంచి తీసివేసే బాధ్యత సీపీఎంపై ఉంది.

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

## పాల ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

## ప్రమాదంలో 18మంది దుర్మరణం

లక్నో,జూలై10: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉన్నావ్ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సు, పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో 18 మంది మృతి చెందగా, 19 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఉన్నావ్ జిల్లా బంగార్‌మౌ ప్రాంతంలోని జోజికోట్ గ్రామ సమీపంలోని బెహతా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు చెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 5.15 గంటలకు బీహార్ నుంచి ఢిల్లీ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులందరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం సిహెచ్‌సి బంగార్మావుకు తరలించారు. కాగా, ప్రాథమిక విచారణలో బస్సు అతివేగంగా దూసుకురావడంతో ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# పరిశ్రమలకు ఇచ్చిన భూముల తనఖా

## సర్కార్ యత్నిస్తోందని కెటిఆర్ ఆరోపణ

హైదరాబాద్,జూలై10 రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సర్కార్ ఇప్పుడు నిధుల సమీకరణకు ఒక ప్రమాదకరమైన మార్గం ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రు.100 కోట్ల కమిషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది అని మీడియాలో కథనాలు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉంది. కొత్తగా పెట్టుబడులు రావడం లేదు. ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయి. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కొరకు పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# రామనగర పేరు మార్పుపై కర్ణాటక సీఎం కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,జూలై10: రామనగర పేరు మార్పు వ్యవహారంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. రామనగర పేరును బెంగళూర్ సౌత్‌గా మార్చడం పట్ల కాషాయ పార్టీ భగ్గుమన్న నేపథ్యంలో ఈ వివాదంపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నేతృత్వంలో రామనగర జిల్లా నేతలు తనను కలిసి రామనగర పేరును బెంగళూర్ సౌత్‌గా మార్చాలని కోరారని తెలిపారు.ఈ విషయంలో క్యాబినెట్ ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, ఈ ప్రతిపాదనను క్యాబినెట్ ముందుంచుతామని తాను వారికి చెప్పానని సీఎం వివరించారు. ఇక కర్నాటక ప్రభుత్వం రామనగర పేరును బెంగళూర్ సౌత్‌గా మార్చాలని కసరత్తు సాగించడం పట్ల బీజేపీ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ హిందూ విద్వేషం, రాముడిపై వ్యతిరేకత ఇప్పుడు పతాకస్థాయికి చేరిందని ఈ వ్యవహారంపై స్పందిస్తూ బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఆరోపించారు.రామజన్మభూమి ఉద్యమాన్ని తాము ఓడించామని రాహుల్ గాంధీ ఇటీవల చెప్పారని, ఇప్పుడు డీకే శివకకుమార్ శ్రీరాముడి పేరు ఉందని రామనగర్ పేరును ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించారు.

# ప్రైవేటు ఆసుపత్రిల రిజిస్ట్రేషన్, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ ద్వారానే ఆమోదించి ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



కామారెడ్డి, జులై 10 ప్రైవేటు ఆసుపత్రిల రిజిస్ట్రేషన్, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ ద్వారానే ఆమోదించి ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రిలో నిర్వాహకులు, వైద్యులు ప్రతినెల నివేదికలు, రోజువారి ప్రసవాల వివరాలు, సీజనల్ వ్యాధుల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని తెలిపారు. సంవత్సరానికి ఒక పర్యాయం రిజిస్ట్రేషన్ పొందిన ఆసుపత్రులను సందర్శించాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. దరఖాస్తులు నమోదు చేసిన డాక్టర్లచే ఆసుపత్రి నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ దరఖాస్తులో నమోదు చేసిన వైద్యులు కాకుండా ఇతర వైద్యులు, వైద్య సేవలు అందిస్తే వైద్యశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మగ పిల్లలు పుట్టడానికి మందులు పోస్తే వారిపైన, ఆస్పత్రి యజమాన్యం పైన డిఆర్ఎ యాక్ట్ 2010, పిసిపి ఎన్డిటి యాక్ట్ 1994 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఏ. అరవింద్ కుమార్, ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు శోభారాణి, శిరీష, వేణుగోపాల్, చలపతి పాల్గొన్నారు.

# ఆర్థిక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి: ఆర్థిక శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. ఈ క్రమంలోనే నేడు ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. రాష్ట్రానికి ఉన్న అప్పుల లెక్కలపై చంద్రబాబు ఆరా తీశారు. ఇప్పటికి అన్ని రకాల అప్పులు కలిపి మొత్తంగా రూ.14 లక్షలు కోట్లు ఉండొచ్చని ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కాగా పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనే అంశంపై చంద్రబాబు సమీక్షించనున్నారు.పెండింగ్ బిల్లుల వివరాలు కోరుతూ ఇప్పటికే శాఖల వారీగా ఆర్థిక శాఖ వివరాలు కోరింది. రాష్ట్రానికి వస్తున్న ఆదాయాలు.. కేంద్రం నుంచి రాబట్టాల్సిన నిధులపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. ఓటాన్ అకౌంట్ పెట్టే అంశంపై ఇవాళ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఆర్థిక శాఖపై విడుదల చేయాల్సిన శ్వేత పత్రంపై చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు.

# ఆర్ఆర్ఆర్ భూ సేకరణపై కీలక ఆదేశాలు



హైదరాబాద్: జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలని ఆదేశించారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండటం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావట్లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు.

# మరోమారు విజృంభిస్తున్న డెంగ్యూ

## పలు జిల్లాల్లో నమోదువృతన్న కేసులు

విజయవాడ/హైదరాబాద్,జూలై10: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ కేసులు పెరుగు తున్నాయి. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు అన్న తేడా లేకుండా కేసులు పెరుగుతున్నాయి. డెంగ్యూ కేసుల న మోదును తెలయి పర్చాలని ఆరోగ్య శాఖ కూడా ఆదేశించినట్లు సమచారం. వర్షా కాలం కావడంతో పాటు ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిల్వ ఉంటున్నాయి. అవే ఇప్పుడు.. దోమలకు ఆవాసాలుగా మారనున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ దోమలు గుడ్లు పెట్టేందుకు ఇదే సరైన సమయం. నిలిచిన నీరు, అధిక తేమ ఏడిస్ దోమ వృద్ధికి కారణమవుతాయి. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిలబడకుండా జాగ్రత్తపడాల్సిందే. దీనికితోడు పారిశుధ్యం సక్రమంగా సాగడం లేదు. కాలం మారుతోన్న కొద్ది డెంగ్యూ కూడా మరింతగా బలోపేతం అవుతోదని, మరింత ప్రమాదకరంగా మారుతోందని డాక్టర్లు చెబుతున్నారు. డెంగ్యూ వస్తే జ్వరం ముదిరి రక్తంలో క్రమేనా ప్లేట్‌లెట్స్ పడిపోవడం మొదలవుతుంది. వెంటనే హాస్పిటల్‌లో జాయిన్ కానట్లయితే.. ప్రాణాలకే ముప్పు. అయితే, ఈ వైరల్ ఫీవర్ మనకు తెలియకుండానే మరో నష్టాన్ని కలిగిస్తోంది. నరాల సంబంధిత సమస్యలను కలిగిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు కేరళ, కర్ణాటక, ఢిల్లీ, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వైద్య నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. డెంగ్యూ సాధారణ ఫ్లూ లక్షణాలను కలిగి ఉన్నా.. అది నాడీ సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. ఎన్సెఫాలిటిస్, మెనింజైటిస్, మైలిటిస్.. మెదడు, వెన్నుపాము వాపుకు కారణమవుతాయి. ఫలితంగా డెంగ్యూ రోగులు తరచు తలనొప్పితో బాధపడతారు. అలాగే వారి మానసిక స్థితిలో కూడా మార్పులు వస్తాయి. కొందరు కోమాలోకి జారుకోవచ్చు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినప్పుడు శరీరంలోని వివిధ భాగాల్లో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. చివరికి మెదడులో కూడా రక్తస్రావం జరిగి.. పరిస్థితి మరింత దిగజారే ముప్పు ఉంది. కాబట్టి, డెంగ్యూను తేలిగ్గా తీసుకోవద్దు. ఇంట్లోనే ట్రీట్మెంట్ చేసుకోవచ్చులే అనుకోవద్దు. డెంగ్యూ రోగిని హాస్పిటల్‌లో చేర్చి డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం చాలా మంచిది. డెంగ్యూ సోకిన రోగిలో ప్లేట్‌లెట్స్ చాలా వేగంగా తగ్గిపోతుంటాయి. ప్లేట్‌లెట్స్ వరకు తగ్గినట్లయితే.. తప్పకుండా హాస్పిటల్‌లో జాయిన్ కావాలి. ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతే.. శరీరంలో రక్తస్రావం ఏర్పడుతుంది. జ్వరం వచ్చి తగ్గుతున్నట్లయితే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. డాక్టర్ సూచన మేరకు రక్తం, ప్లేట్‌లెట్స్‌ల పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. ఒక వేళ ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతున్నట్లు రిపోర్టులో తేలితే.. మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం కూడా డెంగ్యూపై అప్రమత్తం కావాల్సి ఉంది.

# నిర్లక్ష్యం వీడి కరెంట్ కోతలను అరికట్టండి.. కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచన



హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లో కరెంట్ కోతలు సర్వ సాధారణంగా మారాయని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. కరెంట్ కోతలను నివారించాలని విద్యుత్ అధికారులకు రోజు కొన్ని వేల వినతులు వస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎప్పుడంటే ఎప్పుడు కరెంట్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో గంటల కొద్ది కరెంట్ కోతలు ఉంటున్నాయని వచ్చిన వార్తా కథనాలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కరెంట్ కోతలు ఉండటం విద్యుత్ నిర్వహణ లోపానికి నిదర్శనం అని పేర్కొన్నారు. విద్యుత్ సౌధ పక్కనే ఉన్న ఆనంద్ నగర్, మాసాబ్ ట్యాంక్‌లో రాత్రి నుంచి ఉదయం వరకు కరెంటుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడితే పట్టించుకునే వారే కరువయ్యారు అని తెలిపారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కరెంటు కోతలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.పాలమూరు జిల్లాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా 10 నిమిషాల తర్వాత 6:42 గంటల సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఫ్యాన్‌లు, లైట్లు ఆఫ్ అయ్యాయి. ఫంక్షన్‌హాల్‌లో ఉన్న జనరేటర్ సహాయంతో కార్యక్రమం కొనసాగింది. సీఎం వెళ్లిపోయాక విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎక్కడా నిమిషం కూడా కరెంట్ పోవడం లేదని సీఎం చెప్పారు.. కానీ ఆయన ప్రసంగంలోనే కరెంట్ పోవడం గమన్హారం.

# ప్రమాదాలు జరగకుండా బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్













కామారెడ్డి, జూలై 10: జిల్లా లోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు , యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమం బుధవారం నాడు ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం స్కూల్ బస్సు ప్రమాదాలు జరకుండా డ్రైవర్లు, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భముగా జిల్లా సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ సింధుశర్మ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు సంవత్సరాలలో స్కూల్ బస్సు ప్రమాదాలు తక్కువగా జరిగినవి, ఈ సంవత్సరం స్కూల్ బస్సు ప్రమాదాలు జరకుండా డ్రైవర్లు, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ వద్ద పిల్లలు రోడ్డు దాటునపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భముగా జిల్లా రవాణా అధికారి కే. శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ జిల్లాలో 98% బస్సులు ఫిట్నెస్ చేసుకున్నాయి అని, స్కూల్ బస్సు ప్రమాదాలు జరకుండా డ్రైవర్లు, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ సిబ్బంది జె.శ్రీనివాస్, ఆర్. నాగలక్ష్మి, బిక్షపతి, విక్రమ్, రజనీబాయి, సామ్ రిచర్డ్స్, అఫ్రోజుద్దీన్, కానిస్టేబుల్స్, హె?మ్ గార్డ్స్, 200 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు, స్కూల్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

# ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి భాధ్యతలు స్వీకారం



హైదరాబాద్ జూలై 10: హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా కాసుల బాలరాజు పదవి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ బలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, బాన్స్వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు తతిదారులు పాల్గొన్నారు.

# బెల్లయ్య నాయక్ పదవి భాధ్యతలు స్వీకారం



హైదరాబాద్ జూలై 10:హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా బెల్లయ్య నాయక్ పదవి భాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ , డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ గారు పాల్గొన్నారు.

# అడ్లూర్ హైస్కూల్ తనికి చేసిన మున్సిపల్ ఛైర్ పర్సన్

కామారెడ్డి జూలై 10:కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డ్ అడ్లూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డిఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యలనుమున్సిపల్ చైర్మన్ విద్యార్తులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సరిగా లేనందుననిర్వాహకులు, సిబ్బంది పై మున్సిపల్ చైర్ పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనాన్ని సమయపాలన ప్రకారం, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్లు సక్రమంగా లేనందున ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సమయంలో పాఠశాల హెడ్ మాస్టర్ సుజాత,కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సినిమా తీరు

## అర్రె.. భారతీయుడు తెలుగు మల్టీస్టారర్.. భలే మిస్సైందే..?


ఎలాంటి సినిమా చేసినా ఎలాంటి పాత్ర పోషించినా ప్రేక్షకుల్లో అలా గుర్తిండిపోయేలా చేయడంలో లోకనాయకుడు కమల్ హాసన్ ఒకరు. ఆయన చేసిన 200 పైగా సినిమాల్లో ఏ పాత్ర మరొక పాత్రకు దగ్గరగా ఉండదు. అంత విలక్షణ చూపిస్తారు కాబట్టే ఆయన్ను వెండితెర ఉలగనాయకన్ అని అంటుంటారు. ఈమధ్యనే కల్కి సినిమాలో సుప్రీం యాస్కిన్ పాత్రలో వర్సటాలిటీ చూపించిన కమల్ రెండు రోజుల్లో ఇండియన్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శంకర్ డైరెక్షన్ లో కమల్ హీరోగా తెరకెక్కిన ఇండియన్ సినిమాకు సీక్వెల్ గా ఇండియన్ 2 వస్తుంది. 1996 మే 9న రిలీజైన ఇండియన్ అదే భారతీయుడు భాషతో సంబంధం లేకుండా సూపర్ హిట్ గా నిలిచింది. అప్పటి సామాజిక అంశాల మీద అవినీతి మీద శంకర్ మార్క్ సినిమాగా వచ్చిన ఇండియన్ సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. అప్పటికే జెంటిల్మన్ తో సూపర్ అనిపించుకున్న ఆయన ఓ పక్క ప్రేమికుడు తీస్తూనే ఇండియన్ కథ రాసుకున్నారు. ఐతే జెంటిల్మన్ చూశాక రజినికాంత్ శంకర్ డైరెక్షన్ లో సినిమా చేయాలని అనుకున్నారు. ఆ టైం లోనే పరియ మనుషన్ అనే స్క్రిప్ట్ సిద్ధం చేశారు శంకర్. ఆ టైం లో రజిని సినిమా చేయడం కుదరకపోవడంతో ఆ కథనే కాస్త మార్చి కమల్ తో చేశారు. కమల్ హాసన్ తో భారతీయుడు చేయడానికి ముందు తెలుగు హీరోలు రాజశేఖర్, వెంకటేష్ లతో ఈ సినిమా తీయాలనుకున్నారట శంకర్. సేనాపతిగా రాజశేఖర్, ఆయన కుమారుడిగా వెంకటేష్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఐతే ఆ ప్రయత్నాలు కూడా ఎందుకో ముందుకు వెళ్లలేదు. అంతేకాదు కోలీవుడ్ లో కార్తీక్, సత్యరాజ్ లతో కూడా ఇండియన్ సినిమా చేయాలని అనుకున్నారట. కానీ ఏ సినిమా ఎవరికి పడాలని ఆల్రెడీ ముందే రాసి ఉంటుంది. అలానే కమల్ హాసన్ కి కథ చెప్పడం ఆయన ఓకే అనడంతో పాటు రెండు పాత్రలు ఆయనే చేయడం జరిగింది. అప్పటిలోనే సేనాపతి పాత్ర మేకప్ కు గంటల కొద్దీ కమల్ మేకప్ వేసుకునే వారు. కమల్ సేనాపతి మేకప్ వేసింది ఆస్కార్ విన్నర్ హాలీవుడ్ మేకప్ ఆర్టిస్ట్ మైఖెల్ వెస్ట్ మోర్. ఈ సినిమా కోసం శంకర్ చాలా హార్డ్ వర్క్ చేశారు. సుభాష్ చంద్రబోస్ ఒరిజినల్ డాక్యుమెంట్ లోని పుటేజ్ ని తీసుకుని వాటిల్లో కమల్ హాసన్ ని చూపించారు. అప్పట్లోనే ఆయన ఈ టెక్నాలజీని ఉపయోగించడం విశేషం. ఇక హీరోయిన్స్ గా ఐశ్వర్య రాజేష్ చేయాల్సి ఉన్నా ఆమె కుదరకపోవడంతో బొంబాయి సినిమా చూసి మనీషా కొయిరాలాకు ఆ ఛాన్స్ ఇచ్చారు శంకర్. ఇండియన్ సినిమా కోలీవుడ్ లో ఎవర్ గ్రీన్ హిట్ సాధించగా బెస్ట్ యాక్టర్, బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్, బెస్ట్ ఆర్ట్ డైరెక్షన్ విభాగాల్లో నేషనల్ అవార్డులను కైవసం చేసుకుంది. ఇండియన్ సినిమాకు సీక్వెల్ గా శంకర్ కమల్ మళ్లీ ఇన్నాళ్లకు ఇండియన్ 2 సినిమా తెరకెక్కించారు. శుక్రవారం రిలీజ్ అవ్వబోతున్న ఈ సినిమాపై సూపర్ బజ్ ఏర్పడింది. మరి భారతీయుడు రేంజ్ లో భారతీయుడు 2 ఉంటుందా లేదా అన్నది మరో రెండు రోజుల్లో తెలిసిపోతుంది.



## అప్పుడే 'కల్కి' ఓటీటీ...!

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి సినిమా గత వారం ప్రేక్షకుల ముందుకు వచ్చి వెయ్యి కోట్ల వసూళ్ల దిశగా పరుగులు తీస్తున్న విషయం తెల్సిందే. సినిమా విడుదలకు ముందే మేకర్స్ ఈ సినిమాను 50 రోజులు పూర్తి అయ్యే వరకు ఓటీటీ స్ట్రీమింగ్ చేసేది లేదు అంటూ తేల్చి చెప్పారు. సినిమా చూడాలి అనుకున్న వారు అంతా కూడా థియేటర్ లో చూడాల్సిందే.. ఓటీటీ లో వచ్చేందుకు చాలా సమయం పడుతుందని మేకర్స్ పదే పదే చెప్పినప్పటికి థియేటర్లకు వెళ్లి అంతంత డబ్బులు ఖర్చు చేయలేని వారు ఓటీటీ స్ట్రీమింగ్ కోసం వెయిట్ చేస్తున్నారు. కల్కి ఓటీటీ స్ట్రీమింగ్ ఎప్పుడో అంటూ వారు ఆన్ లైన్ లో సెర్చ్ చేస్తున్నారు. చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం కల్కి ని డిజిటల్ ప్రపంచంలో చూడాలి అంటే 8 వారాలు ఆగాల్సిందేనట. ఇప్పటికే అమెజాన్ మరియు నెట్ ఫ్లిక్స్ లతో ఒప్పందాలు చేసుకున్న మేకర్స్ 8 వారాల లోపు స్ట్రీమింగ్ చేయకూడదు అంటూ కండీషన్ పెట్టిందట. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో కల్కి సినిమాను చూడాలి అనుకున్న వారు అమెజాన్ ప్రైమ్ లో చూడాల్సి ఉంటుంది. హిందీ వర్షన్ ను నెట్ ఫ్లిక్స్ స్ట్రీమింగ్ చేయనుంది. రెండు ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో కూడా ఒకే సారి కల్కి సినిమాను స్ట్రీమింగ్ చేసే విధంగా ఒప్పందాలు జరిగాయని సమాచారం అందుతోంది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రకారం ఆగస్టు 15న కల్కి సినిమా స్ట్రీమింగ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇంకా నెలకు పైగా సమయం ఉంది. అప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా కల్కి వసూళ్లు తగ్గడంతో పాటు, ఫుల్ రన్ పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఆగస్టు 15 కచ్చితంగా వస్తుందనే అభిప్రాయం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ తో పాటు ఈ సినిమాలో అమితాబచ్చన్, దీపికా పదుకునే, కమల్ హాసన్, దిశా పటానీ, విజయ్ దేవరకొండ, రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ ఇంకా ఎంతో మంది ప్రముఖులు చిన్న పాత్రల్లో కనిపించారు. సినిమా మూడు గంటల నిడివితో ఉన్నా కూడా ఫ్యాన్స్ మరియు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. మొదటి వారం రోజులు బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన కల్కి సినిమా మొన్న సోమవారం నుంచి కాస్త తగ్గినట్లుగా తెలుస్తోంది. మళ్లీ వీకెండ్ వరకు ఈ సినిమా పుంజుకుంటే రికార్డు స్థాయి వసూళ్లు నమోదు అవ్వడం ఖాయం అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అందానికే మరో అందం....



## స్పిరిట్ లో కొరియన్ స్టార్ ఉన్నాడా? ఫ్యాన్స్ రచ్చేంటి?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో స్పిరిట్ మూవీ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇంకా సెట్స్ పై వెళ్లకుండానే ఆ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అర్జున్ రెడ్డి, యానిమల్ మూవీస్ తో తన సత్తా ఏంటో చాటిన సందీప్ వంగా.. స్పిరిట్ మూవీని భారీగా ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేస్తున్న ఆయన.. 2024 చివరలో సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.




అయితే అటు ప్రభాస్.. ఇటు సందీప్.. ఇద్దరూ కూడా సక్సెస్ జోష్ లో ఉన్నారు. దీంతో వీరి కాంబినేషన్ లో సినిమా అంటే.. ఫ్యాన్స్ తోపాటు సినీ ప్రియులు భారీ ఎక్స్పెక్టేషన్స్ పెట్టుకున్నారు. స్పిరిట్ లో వైలెన్స్ భారీగా ఉంటుందని ఇప్పటికే పరోక్షంగా చెప్పారు సందీప్. అయితే స్పిరిట్ మూవీకి సంబంధించి ఎప్పటికప్పుడు వార్తలు వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో కొరియన్ స్టార్ నటిస్తున్నట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే. దక్షిణ కొరియా స్టార్ మా డాంగ్ సియోక్ స్పిరిట్ మూవీలో విలన్ గా నటించనున్నారని జోరుగా చర్చ సాగుతోంది. మూవీ స్టోరీ అంతర్జాతీయ నేపథ్యంలో ఉంటుందని, అందుకే హాలీవుడ్ నటులపై సందీప్ దృష్టిసారించారని టాక్ వినిపిస్తోంది. అయితే ఇందులో నిజమెంతో తెలియదు. కానీ.. డాంగ్ సియోక్ ఇన్ స్టా పోస్టుల కామెంట్ సెక్షన్ లో ప్రభాస్ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. ప్రభాస్ తో నటించండి డాంగ్ అంటూ ఫ్యాన్స్ కోరుతున్నారు. పాప్ కార్న్ తింటున్న వీడియోను రీసెంట్ గా డాంగ్ షేర్ చేయగా.. అసలు మీరు ప్రభాస్ తో స్పిరిట్ మూవీలో నటిస్తున్నారా అని మరికొందరు అడుగుతున్నారు. ప్రభాస్ స్పిరిట్ అంటూ ఫైర్ ఇమోజీలు పెడుతున్నారు. బాహుబలి, సలార్ లోని ప్రభాస్ మేనరిజమ్స్ ను ఉఎఈబ రూపంలో కామెంట్స్ పెడుతున్నారు. కొరియన్ బాలయ్య అని ఇంకొందరు రచ్చ రచ్చ చేస్తున్నారు. బహుశా.. డాంగ్ కు అసలేం జరుగుతుందో తెలియకపోయి ఉండవచ్చు ద గుడ్ ద బ్యాడ్ ద వీర్డ్, ద రౌండప్, ద ఔట్ లాస్ వంటి పలు చిత్రాలతో నటుడిగా ఫుల్ ఫేమ్ సంపాదించుకున్నారు. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్ ఎటర్నల్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మరి ఆయన.. ప్రభాస్ స్పిరిట్ లో నటిస్తున్నారో లేదో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేంత వరకు వేచి చూడాలి. కానీ వైరల్ వార్తలు నిజమైతే మాత్రం ప్రభాస్ ఫ్యాన్స్ కు పండగే. మరేం జరుగుతుందో వెయిట్ అండ్ సీ.

## తెలుగులో అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన డబ్బింగ్ సినిమాలివే

చాలా కాలంగా టాలీవుడ్ లో డబ్బింగ్ సినిమాల ప్రభావం ఉంది. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరోల సినిమాలని తెలుగులో కూడా డబ్ చేసి రిలీజ్ చేస్తారు. వారికి టాలీవుడ్ లో మంచి మార్కెట్ ఉంది. సూపర్ స్టార్ రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, విక్రమ్, కార్తీ, విజయ్, అజిత్, విశాల్ లాంటి తమిళ్ హీరోలకి తెలుగులో కూడా మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. వారి సినిమాలు తమిళంలో కంటే తెలుగులో బిగ్గెస్ట్ హిట్ అయిన సందర్భాలు ఉన్నాయి. కన్నడ ఇండస్ట్రీ నుంచి రాకింగ్ స్టార్ యష్, కొత్తగా రిషబ్ శెట్టి టాలీవుడ్ లో ఇంపాక్ట్ క్రియేట్ చేయగలిగారు. గత కొన్నేళ్ల నుంచి సౌత్ లో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి. హీరో రేంజ్ బట్టి ఆ సినిమాలకి తెలుగులో మంచి బిజినెస్ జరుగుతోంది. ఇలా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కి అత్యధిక బిజినెస్ జరిగిన సినిమాల జాబితాలో చూసుకుంటే టాప్ లో రాకింగ్ స్టార్ కేజీఎఫ్ చాప్టర్ 2 మూవీ ఉంది. ఈ సినిమాకి తెలుగు రాష్ట్రాలలో 78 కోట్ల బిజినెస్ జరిగింది. అదే స్థాయిలో కలెక్షన్స్ ని కూడా కేజీఎఫ్ చాప్టర్ 2 వసూళ్లు చేసింది. ఆ తరువాత హైయెస్ట్ బిజినెస్ చేసిన మూవీ అంటే శంకర్, సూపర్ స్టార్ రజినీకాంత్ కాంబినేషన్ లో వచ్చిన 2.ఓ. ఈ చిత్రం 71 కోట్ల బిజినెస్ ని తెలుగు రాష్ట్రాలలో చేసింది. తరువాత స్థానంలో 39 కోట్ల ప్రీరిలీజ్ బిజినెస్ తో చియాన్ విక్రమ్, శంకర్ కాంబినేషన్ లో వచ్చిన ఐ మూవీ ఉంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా పా రంజిత్ దర్శకత్వంలో వచ్చిన కాలా మూవీ 33 కోట్ల బిజినెస్ తో నాలుగో స్థానంలో ఉండగా వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన మొదటి సినిమా కబాలి పైన 31 కోట్ల ప్రీరిలీజ్ వ్యాపారం అయ్యింది. ఇక రోబో మూవీ 27 కోట్ల వ్యాపారంతో ఆరో స్థానంలో నిలిచింది. దీని తర్వాత ప్లేస్ లో కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి రాబోతున్న భారతీయుడు 2 ఉంది. ఈ సినిమాపై 25 కోట్ల బిజినెస్ తెలుగు రాష్ట్రాలలో జరిగింది. నెక్స్ట్ ప్లేస్ లో సూర్యం సింగం3 మూవీ 20 కోట్ల బిజినెస్ తో నిలిచింది. తెలుగులో హైయెస్ట్ బిజినెస్ పరంగా చూసుకుంటే ఎవర్ గ్రీన్ గా సూపర్ స్టార్ రజినీకాంత్ ఉన్నాడని చెప్పొచ్చు. ఆయన సినిమాలన్నీ కూడా 20+ కోట్లకి పైనే తెలుగు రాష్ట్రాలలో బిజినెస్ చేస్తాయి. కమల్ హాసన్ సినిమాలకి తెలుగులో మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. భారతీయుడు 2 బిజినెస్ పరంగా చాలా తక్కువగా బిజినెస్ జరిగిందని చెప్పొచ్చు. అందుకే ఏ మాత్రం పాజిటివ్ టాక్ తెచ్చుకున్న తెలుగు రాష్ట్రాలలో మొదటి వారం రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ కలెక్షన్స్ ని అందుకునే ఛాన్స్ ఉందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు.




## బొప్పాయి తింటే ఏమౌతుందో తెలుసా..?



బొప్పాయ్‌లో అనేక అనారోగ్యాలను నిర్మూలించే శక్తి వుంది. బొప్పాయ్‌లో వైటమిన్ సి చాలా ఎక్కువ మోతాదులో లభించడం వల్ల ఇది మనలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు వైటమిన్ ఏ బొప్పాయ్‌లో ఎక్కువగా వుంటుంది. బొప్పాయ్ రుచికరమైన పండు మాత్రమే కాదు పోషకాలు ఘని కూడా. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా వుండడం వల్ల గుండెకు చాలా మేలు చేస్తుంది. బొప్పాయ్‌లో పీచు పదార్ధం కూడా ఎక్కువగా వుంటుంది. పీచు వున్న పదార్ధాలు గుండె జబ్బులను రాకుండా చేస్తుంది. రక్తంలో వుండే గ్లూకోజ్ స్థాయిని కూడా కంట్రోల్‌లో వుంచుతుంది. బొప్పాయ్‌లో ఫోలిక్ యాసిడ్ కూడా చాలా ఎక్కువ మోతాదులో వుంటుంది. బొప్పాయ్‌లో బీటా కెరోటిన్ కూడా సమృద్ధిగా వుంటుంది. ఇందులో వుండే పొటాషియం బ్లడ్ ప్రెజర్‌ను బాగా కంట్రోల్‌లో వుంచుతుంది. ఫైబర్ ఎక్కువగా వుండడం వల్ల మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. స్టమక్ క్యాన్సర్, కొలన్ క్యాన్సర్లు రాకుండా నివారిస్తుంది. తక్కువ జీతం వచ్చినా ప్రశాంతమైన జీవితం కావాలంటే ఇలా చెయ్యండి, రిస్క్ వద్దు, ఇది కోటీశ్వరుల అతి పెద్ద రహస్యం.. ఇందులో వుండే బీటీ కెరోటిన్ కంటి చూపుకు ఎంతో మేలు చేస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. 14 పళ్లపై పరిశోధనలు జరిపినప్పుడు రొమ్ము క్యాన్సర్‌కు విరుగుడును బొప్పాయ్‌లో వున్నట్లు పరిశోధనలో కనుగ్గొన్నారు. ఇందులో చాలా తక్కువ మోతాదులో సోడియం వుంటుంది. కాబట్టి దీన్ని హార్ట్ ఫెయిల్యూర్ పేషంట్లకు, కిడ్నీ ఫెయిల్యూర్ పేషంట్లకు కూడా ఇవ్వవచ్చు. మన శరీరంలో ప్రతీ ఒక్క అవయవానికి బొప్పాయ్ చాలా మేలు చేస్తుంది. డయాబెటీస్‌తో బాధపడేవారు రోజుకు 100 గ్రాముల బొప్పాయిని తీసుకోవచ్చు. వీలయితే బొప్పాయిని కూరలో వాడుకోవచ్చు. పపాయాను జ్యూస్ చేసి చిన్నపిల్లలకు ఇవ్వచ్చు. సహజీవనం వల్ల కలిగే ప్రయోజనాలు..నష్టాలు..! పపాయతో మనకు ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయ్. వైటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఇలా ఎన్నో వున్నాయ్. బ్లడ్ గ్లూకోజ్‌ను మెయింటేయిన్ చేస్తుంది, బ్లడ్ ప్రెజర్‌ను కంట్రోల్ చేస్తుంది, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది, బరువు తగ్గించడంలో సహాయపడుతుంది, మోషన్‌ను ఫ్రీగా వుంచుతుంది, క్యాన్సర్‌ను నివారిస్తుంది, రోగనిరోధక శక్తిని అమాంతం పెంచుతుంది. బొప్పాయి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్టులు వుండవు. కానీ కొంత మందికి బొప్పాయ్ తినడం వల్ల దద్దుర్లు, ఎలర్జీలు వస్తాయ్. బొప్పాయ్‌లో సహజమైన చెక్కరలు వుంటాయ్. ఎవరికి వారు తమ ఆరోగ్య అవసరాన్ని బట్టి బొప్పాయ్ తినవచ్చు. ఒక మీడియం సైజు బొప్పాయ్‌లో 120 వరకు క్యాలరీలు వుంటాయ్. ఇందులో యాంటీ క్యాన్సర్ లక్షణాలు వున్నాయ్ కాబట్టి బొప్పాయ్‌ను తప్పకుండా తినాల్సిందే. కొందరికి బొప్పాయ్ పడకపోతే వెంటనే వై?ద్యులను సంప్రదించడం చాలా మంచిది. అలాంటి వారు వైద్యుడి సూచనమేరకు మాత్రమే బొప్పాయిని తీసుకోవాలి.

## శ్రీలంక పర్యటనకు భారత జట్టు.. సీనియర్లకు సెలవ్.. రీఎంట్రీ ఇవ్వనున్న ముగ్గురు..



జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడిన తర్వాత భారత జట్టు శ్రీలంకలో పర్యటించాల్సి ఉంది. శ్రీలంకతో భారత్ మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. నివేదికల ప్రకారం, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి దిగ్గజాలు ఈ పర్యటనకు వెళ్లరు. ఈ సిరీస్ నుంచి కూడా వారికి విశ్రాంతి ఇవ్వవచ్చు. ఇటువంటి పరిస్థితిలో, జట్టులోకి తిరిగి రావడానికి కొంతమంది ఆటగాళ్లు వేచి చూస్తున్నారు. టీ20 సిరీస్‌కు భారత్‌కు పెద్దగా ప్రాధాన్యత ఉండదు. కానీ, వన్డే సిరీస్‌కు మరింత ప్రాధాన్యత ఉంటుంది. త్వరలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ దృష్ట్యా వన్డే సిరీస్ సన్నాహక పరంగా ఎంతో కీలకం కానుంది. ఈ కారణంగా, టీమ్ ఇండియాకు తిరిగి వచ్చే ఆటగాళ్లు కూడా ఎన్నో ఆశలతో చూస్తున్నారు. ఈ లిస్టులో ఎవరున్నారో ఓసారి చూద్దాం..వన్డే సిరీస్‌కు కేఎల్ రాహుల్ పునరాగమనం దాదాపు ఖాయమని భావిస్తున్నారు. రోహిత్ శర్మ గైర్హాజరీతో టీమిండియా కెప్టెన్‌గా కూడా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని వస్తున్నాయి. గతేడాది డిసెంబర్‌లో భారత్ తరపున చివరి వన్డే ఆడాడు. కాగా, అతను చివరిసారిగా ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో టీమిండియా తరపున ఆడాడు. ఇటువంటి పరిస్థితిలో, కేఎల్ రాహుల్ చాలా కాలం తర్వాత భారత జట్టులోకి తిరిగి రావచ్చు. క్రమశిక్షణారాహిత్యం కారణంగా శ్రేయాస్ అయ్యర్‌కు భారత సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వలేదు. ఈ కారణంగా, అతను చాలా కాలం పాటు భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. అయితే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ గైర్హాజరీతో వన్డే జట్టులో శ్రేయాస్ అయ్యర్‌కు అవకాశం ఇవ్వవచ్చు. అయ్యర్ ౹ాఆఎ మ్యాచ్‌లలో అద్భుతమైన ఆటగాడు, సెంట్రల్ కాంట్రాక్ట్ లేకపోయినా, అతను జట్టులో చోటు సంపాదించగలడు. శార్దూల్ ఠాకూర్‌ను టి20 ప్రపంచకప్ జట్టులో ఎంపిక చేయలేదు లేదా జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బహుశా శ్రీలంక టూర్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ వంటి బౌలర్లు ఉండరు. ఇటువంటి పరిస్థితిలో, ఠాకూర్ బౌలింగ్ ఆల్ రౌండర్‌గా జట్టులో తన స్థానాన్ని సంపాదించుకోవచ్చు.

## ఒరేయ్ ఆజామూ.! ఎంత పని జరిగింది.. దెబ్బకు కెప్టెన్సీ పోస్ట్ హుష్‌కాకి.? మరి నెక్స్ట్ ఏంటి

వరుస పరాభవాలతో డీలా పడ్డ పాకిస్తాన్ క్రికెట్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా జాసెన్ గిల్లెస్పీకి బాధ్యతలు అప్పగించిన పాక్ క్రికెట్ బోర్డు, పరిమిత ఓవర్ల క్రికెట్ ప్రక్షాళనపైనా దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగా వన్డే, టీ20 జట్ల కెప్టెన్‌గా వ్యవహరించిన బాబర్ ఆజంపై వేటు వేయనున్నట్లు తెలుస్తోంది. సారథిగా అతడిని తప్పించేందుకు బోర్డు మొగ్గుచూపుతున్నట్లు పాక్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వన్డే వరల్డ్‌కప్-2023లో పాకిస్తాన్ కనీసం సెమీస్ కూడా చేరకుండానే నిష్క్రమించిన నేపథ్యంలో బాబర్ ఆజం మూడు ఫార్మాట్ల కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. ఈ క్రమంలో టెస్టు పగ్గాలను షాన్ మసూద్‌కు అప్పగించిన పీసీబీ.. టీ20 సారథిగా షాహిన్ ఆఫ్రిదిని నియమించింది. అయితే, షాహిన్ కెప్టెన్‌గా ఆకట్టుకోకపోవడంతో టీ20 ప్రపంచకప్-2024 ఆరంభానికి ముందే బాబర్ ఆజంకు తిరిగి వన్డే, టీ20 నాయకుడిగా బాధ్యతలు అప్పగించింది. కానీ.. ఈసారి కూడా అతడికి చేదు అనుభవమే ఎదురైంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.